కథానిక

# ఋణం

— పల్లేటి బాలాజీ



(గత సంచిక తరువాయి)

"గోపీ! నీ ప్రశ్నకు నా సమాధానం ఏమిటో నీకే తెలుసు. నీకొచ్చిన ఈ గొప్ప అవకాశాన్ని నువ్వు వదులుకోలేకపోయినా ఒక్కటి మాత్రం బాగా గుర్తుంచుకో. ప్రతి వ్యక్తి మాతృ పితృ రుణంతోపాటు సమాజ రుణం కూడా తీర్చుకోవాలి. ముఖ్యంగా నీలాంటి తెలివిగల వ్యక్తులు తప్పకుండా సమాజ రుణం తీర్చుకు తీరాలన్న విషయం మాత్రం గుర్తుంచుకో చాలు.."

ఆపై ఎందుకో మాట్లాడలేకపోయాడు.

వరించి వచ్చిన అదృష్టాన్ని వదులుకోలేని గోపీకృష్ణ అమెరికాకి ఎగిరాడు.

తన జ్ఞానం పెంచుకోవడానికి పిహెచ్‌డి చేసి రామచంద్రయ్య మాత భూమి మీదే నిలబడ్డాడు. అతడే ఉద్యోగం కోసమూ దరఖాస్తు చేసుకోలేదు. విద్యాలయాలు నిరుద్యోగుల్ని తయారుచేసే కార్ఖానాలని అతడెన్నడూ అనుకోలేదు. నిరుద్యోగులకు పిలిచి ఉద్యోగాలివ్వడంలేదని ప్రభుత్వాన్ని ఏనాడూ నిందించలేదు.

అజ్ఞానాంధకారంలో మగ్గుతున్న ఓ పల్లెటూరికెళ్ళాడు.

చదువురాని పిల్లలకు, పెద్దలకు అక్షరాన్ని నేర్పించాడు. నీతి సూత్రాన్ని నైతిక విలువల్ని బోధించాడు. నిర్వీర్యం అయిపోతున్న యువశక్తిని మేల్కొలిపి సంఘటితం చేశాడు. చిన్ననాటి తన ఆశయాల్ని కొంతవరకైనా ఆచరణలో పెట్టగలిగాడు.

రామచంద్రయ్య జీవితం గోపీకృష్ణకు చాలా ఆశ్చర్యకరమైన విషయం.

తన మిత్రుడు అనుకున్నది సాధించడంలో కృతకృత్యుడైనందుకు ఏదో ఒకమూల తృప్తి...గర్వమూ కూడా! కానీ అంత ప్రతిభను అలా పరిమితం చేసుకున్నందుకు అసహనం కూడా! కారు వేగంగానే పోతున్నా రామచంద్రయ్యని చూడాలన్న తహతహతో కారు తొందరగా పోనివ్వమన్నాడు గోపీకృష్ణ.

పరుగెడుతున్న కారు వున్నట్టుండి ఆగడంతోపాటు 'జిందాబాద్'లు వినిపించాయి. ఏంటన్నట్టు కుర్రాడివంక చూశాడు గోపీకృష్ణ. కుర్రాడు కారుదిగి చూసి వచ్చి...

"మీతోపాటు విమానం దిగిన కేంద్రమంత్రిగారిని ఊరేగింపుగా ఇంటికి తీసుకెడుతున్నారుసార్ ఆయన అభిమానులు. అందువల్ల ట్రాఫిక్‌కి అంతరాయం కలిగింది" అన్నాడు.

ఇప్పుడెలా? అన్నట్టు చూశాడు గోపీకృష్ణ.

"నేను ఎలాగైనా మిమ్మల్ని హోటల్‌కి తీసుకెళ్తాను సార్" ఎంతో వినయంగా చెప్పి కారు వెనక్కు తిప్పాడు.

"మనం తొందరగా హోటల్‌కెళ్ళాలి. పదిగంటలకల్లా నా స్నేహితుడ్ని హోటల్ దగ్గర వుండమని ఉత్తరం రాశాను. టైం పది కావస్తోంది." అన్నాడు గోపీకృష్ణ.

"పదింటికంతా మనం హోటల్‌కి చేరుకుంటాం సార్"

వెనక్కు తిరిగిన కారు సందుల్లో గొందులగుండా హోటల్‌వైపు పరుగెడుతోంది.

"ఏంటో సార్...అవినీతి ధనార్జనల్ని మాత్రమే తన ధ్యేయంగా పెట్టుకొని మంత్రి పదవిలో కొనసాగుతున్న ఆ మంత్రిగారికి ప్రజలు ఎలా జేజేలు కొడుతున్నారో చూశారుగా.." చెప్పాడా కుర్రాడు.

ఏం మాట్లాడాలో తెలియక సమాధానంగా నవ్వాడు గోపీకృష్ణ.

"అతడు కేవలం రౌడీయిజం, రిగ్గింగులతో ఎన్నికల్లో గెలిచి మంత్రయ్యాడు. అసలు నిజాయితీపరులైన ప్రజానాయకులకు ప్రజలు నిర్భయంగా ఓటెయ్యగలిగే స్థితికి ఎప్పుడొస్తారో..? ఆ మార్పు ఎప్పుడొస్తుందో...? పరిణామక్రమంలో కాలంతోపాటు మార్పు కూడా సహజంగానే వస్తుంది. వచ్చితీరుతుంది. కానీ మార్పు ఎప్పుడో వస్తుందని ఓర్పుతో ఎదురు చూడకుండా తెలివైనవాళ్ళు తమ నేర్పుతో ప్రజల్ని కొద్దికొద్దిగా మార్చేందుకు ప్రయత్నించాలి సార్... ప్రయత్నమే లేకుండా ఫలితం కోసం ఎదురచూడ్డం ఎందుకో నాకు గిట్టదు సార్".

మాటల్లోనే హోటల్ చేరుకుంది కారు.

కారు దిగిన గోపీకృష్ణకు తెల్లటి ఖద్దరు బట్టమీద కాఫీ మరకలా ఎంతో ఖరీదైన ఆ హోటల్ కారిడార్‌లో నిరాడంబరంగా నిలబడ్డ రామచంద్రయ్య కన్పించాడు. అతడిదగ్గరకెళ్ళి 'రాముడూ!' అంటూ అతడి భుజాన్ని పట్టుకుని ఆప్యాయంగా వూపాడు గోపీకృష్ణ.

స్నేహితుడివైపు ఆశ్చర్యంగా చూశాడు రామచంద్రయ్య.

నెరసిన జుట్టుకి వేసిన నల్లరంగు కొట్టొచ్చినట్టు కన్పిస్తోంది. చలి దేశంలో వుండడంవల్లనేమో తెల్లటి అతడి మొహం మీద ఎరుపు జీరలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

బ్రౌన్ షూ, గోధుమరంగు ప్యాంటులో టక్ చేసిన ఎర్రపూల చొక్కా... అందంగానే కన్పిస్తున్నా అతడు వయసుని దాచే ప్రయత్నం చేస్తున్నాడనిపిస్తోంది.

"గోపీ...నువ్వేనా...?!"

"నేను గోపీనేరా... కానీ నువ్వు.. వయసుకి మించిన నీ ముసలితనం అదీ చూస్తుంటే... నా రాముడివేనా అన్న అనుమానం కలుగుతోంది"

"అనాగరీకులైన పల్లెవాసుల మధ్య బ్రతికేవాడ్ని...అధునాతన పోక

ర్యాల మధ్యన తిరిగే ఈ నవనాగరీకుల మధ్య నుండి ఇలాగే కన్పిస్తానుగానీ.. నువ్వేంటి వయసు పెరిగేకొద్దీ కుర్రాడిలా తయారైపోయావు..కొంపదీసి అమెరికాలో అమృతంగాని దొరుకుతోందా?" నవ్వుతూ అడిగాడు.

"హాలాహలం తప్ప అమృతం దొరికే ప్రదేశం కాదురా అది" అంటూ బాధగా చెప్పాడు.

"అది తెలుసుకోవడానికి పాతికేళ్ళు పట్టిందా?"

"ఇక్కడెందుకులే పద గదిలోకెళ్ళి మాట్లాడుకుందాం" అన్నాడు గోపీకృష్ణ.

ఇద్దరూ కలిసి తొమ్మిదవ అంతస్థులోని గదికెళ్ళడానికి లిఫ్ట్ ఎక్కారు. లిఫ్ట్ కదలిక కూడా ఏమాత్రం తెలియకుండా పైకి వెడుతుంటే... గోపీ కృష్ణ హైస్కూల్లో చేరడానికి మొట్టమొదటిసారిగా టౌనుకొచ్చినపుడు మేడమీదకెక్కడానికి వున్న మెట్లను చూసి "హై..! భలే తమాషాగా వుందే... ఇంటిమీదకు కూడా ఎక్కొచ్చన్నమాట.." అంటూ ఆ మెట్ల మీద ఆనందంగా అతడు గెంతడం గుర్తొచ్చింది రామచంద్రయ్యకు. గోపీకృష్ణ మాత్రం ఆలోచిస్తూ ఏదో లోకంలో వున్నట్టుగా వున్నాడు. మానవ సంబంధాలంటే ఏమిటో తెలియని యాంత్రిక వాతావరణంలో పెరిగిన గోపీకృష్ణ భార్య అతి బలవంతంగా ఆరేళ్ళు అతడితో కాపురం చేసింది. ఆ తర్వాత కొడుకూ, కూతుర్ని తండ్రి చేతిలో పెట్టి విడాకులు తీసుకుని హాయిగా(?) తనదారిన తను బ్రతకసాగింది. అప్పటివరకు కేవలం డబ్బు సంపాదన కోసమే ఉద్యోగం చేస్తున్న అతడు ఆనాటి నుంచి తన పిల్లలిద్దరూ బ్రతకడానికి కావలసినంత మాత్రమే సంపాదించసాగాడు.

కొడుకూ కూతురు పెళ్ళి వయసుకి వచ్చారని తెలుసుకున్న అతడు వారికి రెండు సంబంధాలు చూసి వాళ్ళతో చెప్పేసరికి 'మా లైఫ్ పార్ట్‌నర్స్‌ని మేం ఎప్పుడో సెటిల్ చేసుకున్నాం. మీరు మాకు అడ్డురాకండి ప్లీజ్" అంటూ వాళ్ళిద్దరూ సమాధానం చెప్పారు. అతడి ఆశాసౌధం కూలిపోయింది.

పెళ్ళయిన నెలకే పిల్లలిద్దరూ 'ఫామిలీ లైఫ్ ట్రాష్ డాడీ... అందుకే విడాకులు తీసుకున్నాం" అంటూ ఏక కంఠంతో చెప్పేసరికి తట్టుకో లేకపోయాడు గోపీకృష్ణ.

మానసికంగా ఎంతో క్షీణించిపోయిన అతడ్ని కొన్నాళ్ళు ఎక్కడికైనా వెళ్ళి ప్రశాంతంగా వుండిరమ్మని డాక్టర్లు సలహా ఇచ్చినపుడు దాదాపు పాతికేళ్ళ క్రితం తను మరచిన మాతృభూమి గుర్తొచ్చింది. మాతాపితలు భూమ్మీద లేకపోయినా మాతృభూమే గుర్తొచ్చిందతడికి.

"గోపీ! ఏంట్రా మౌనంగా వుండిపోయావు?" అంటూ రామచంద్రయ్య అడిగేసరికి ఆలోచనల్లోంచి బయటకొచ్చి.

"ఏం మాట్లాడాలో తెలియక" మెల్లగా చెప్పాడు.

అతడి మొహం చూస్తుంటే కడుపులోని బాధనంతా ఒకేసారి బయటకు కక్కేయాలన్నట్లుంది.

"గోపీ! ప్రశాంతంగా గడపడానికొస్తున్నట్లు ఉత్తరంలో రాశావు... ఈ యాంత్రిక వాతావరణంలో ప్రశాంతత దొరుకుతుందా?" అధునాతన సౌకర్యాలున్న ఆ గదిని పరికించి చూస్తూ అడిగాడు.

"పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డానికి కాదురా నేనొచ్చింది"

"మరైతే నేనుంటున్న పల్లెటూరికెళ్దామా?"

"కొద్దిరోజులు నేను ప్రశాంతంగా గడపాలి. ఎక్కడికైనా పర్వాలేదు"

"అలాగైతే పల్లెటూరికే వెళ్దాం."

"నీ ఇష్టం రాముడూ... ఎక్కడికైనా తీసుకెళ్ళు... కానీ ఒక్క షరతు నాకోసం నువ్వు ప్రత్యేకంగా ఏ రకమైన ఏర్పాట్లు చెయ్యకూడదు. నీతోపాటు నీ వాడిగా ఓ నెలో రెండు నెలలో ప్రశాంత జీవనం గడపనీ చాలు."

"ప్రత్యేకమైన ఏర్పాట్లలో నాకు నమ్మకం లేదు, చేయగల శక్తీ నాకు లేదులేగానీ...రోజంతా ప్రయాణం చేసి అలసిపోయి వుంటావు కాసేపు విశ్రాంతి తీసుకో..." అన్నారు రామచంద్రయ్య.

ఇద్దరూ కలసి సాయంత్రం చార్మినార్ ఎక్స్‌ప్రెస్ ఎక్కారు.

చాలా రోజుల తర్వాత రైలు ప్రయాణం చేస్తున్న గోపీకృష్ణకు ఆ



అనుభవం కొత్తగా అనిపించింది.

మధ్యాహ్నం బడలికమీద బాగా నిద్రపోయాడేమో ఇప్పుడు నిద్ర కూడా రావడంలేదు.

కిటికీలోంచి బయటకు చూద్దామంటేని అంతా చీకటి.

తను తెచ్చుకున్న చేతి సంచిని కిటికీ పక్క తగిలించి దాన్ని కాపాడ్డానికి అన్నట్టుగా రామచంద్రయ్య దించిన అద్దంలో తన మొహం తనకే కన్పించసాగింది. కింద నిద్రపోతున్న రామచంద్రయ్య మొహం పక్కనే తన మొహం కన్పించినట్లు అన్పించింది. ప్రశాంతంగా నిద్రపోతున్న రామచంద్రయ్యను చూడగానే తనకు తీరని ఆశలన్నీ గుర్తొచ్చాయి. మిత్రుడితో గడిపి తేలికపడ్డ మనసు మళ్ళీ జారుకుంటుందేమో అన్న భయంతో సైక్రియాటిస్ట్ చెప్పిన విధంగా చిన్నప్పుడు బట్టీపట్టిన సైమ్స్ సూత్రాన్ని తెలుగులో గుర్తు తెచ్చుకుంటూ కాలం గడిపాడు.

తెల్లారి గూడూరులో దిగారు.

"గోపీ! ఎనిమిదిన్నరకు ఇక్కడ నుంచి మనూరి బస్సుంది. అరగంట ప్రయాణం" రామచంద్రయ్య చెప్పింది విని పాతికేళ్ళలో ఎన్నెన్నో మార్పుల్ని సంతరించుకున్న వూరిని పరికించి చూడసాగాడు గోపీకృష్ణ.

"సార్...ఆకలిగా వుంది. ఓ రూపాయి ధర్మం చెయ్యండి" గోపీకృష్ణనది దీనంగా అడిగాడొకడు.

జేబులోంచి రెండు రూపాయి బిళ్ళలు వాడి చేతిలోపెట్టి–

"ఏంటో పాపం..." రామచంద్రయ్యవంక చూస్తూ విచారపడ్డాడు.

"ఇలాంటివాళ్ళను గురించి విచారించితే సరిపోదుగానీ... బస్సుకింకా రెండుగంటలుంది. అలా బజారువైపుకెళ్ళి కాఫీ తాగొద్దామా?"

"తాగొద్దాం..నాకూ ఊరు చూడాలని వుంది." సంతోషంగా చెప్పాడు గోపీకృష్ణ.

(మిగతావచ్చేవారం)